## ఐకెపి సెంటర్ల నుంచి కొనుగోలు చేసిన

# ధాన్యాన్ని తక్షణమే తరలించాలి




ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శుక్రవారం 15 మే 2026 | పేజీలు : 8

# మాది రైతు పక్షపాతి ప్రభుత్వం



### రబీలో రైతులు పండించిన చివరి గింజ వరకు మద్దతు ధర చెల్లించి కొంటాం

### ఇప్పటికే రూ.4600 కోట్లు రైతుల ఖాతాల్లో: మంత్రి ఉత్తమ్

**ప్రజాపక్షం/నల్లగొండ :** రబీలో రైతులు పండించిన చివరి గింజ వరకు మద్దతు ధర చెల్లించి కొంటామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.గురువారం నలంలగొండ జిల్లా కనగల్ మండలం చెట్ల చెన్నారంలోని పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్,మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తో కలిసి ఆయన తనిఖీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.4600 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని ఉత్తమ్ తెలిపారు. రబీలో 65 లక్షల ఎకరాల్లో 140 లక్షల మెట్రిక్ టన్నుల వరి పండగా,8090 లక్షల మెట్రిక్ టన్నులు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు.రాష్ట్రవ్యాప్తంగా 8575 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని,ధాన్యం తరలింపునకు జిల్లా కలెక్టర్లకు విస్తృత అధికారాలు ఇచ్చామని వివరించారు. రానున్న 23 రోజుల్లో మరో 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు పంపి రూ.3000 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు.నల్లగొండ జిల్లాలో 5.46 లక్షల ఎకరాల్లో 14.65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండగా,ఇప్పటివరకు 7.24 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని తెలిపారు. జిల్లాలో 456 కొనుగోలు కేంద్రాల ద్వారా 53,611 మంది రైతులకు రూ.692 కోట్లు చెల్లించామని, మరో రెండు మూడు రోజుల్లో రూ.400 కోట్లు జమ చేస్తామని చెప్పారు.తరుగు, తాలు విషయంలో మిల్లర్లు, ట్రేడర్లు రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రాష్ట్ర ఎస్సి అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి,నల్లగొండ జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రబీలో రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొంటుందని ,అంతేకాక నిర్దేశించిన సమయంలో రైతుల ఖాతాలలో ధాన్యం డబ్బులు జమ చేయడం జరుగుతుందని, ట్రాన్స్పోర్ట్ ,హమాలి సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని, ఈసారి పెద్ద ఎత్తున పంట వచ్చిందని, రైతులకు కష్టం కలగకుండా రైతుల చెంతకే వచ్చి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొంటున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర రోడ్లు,భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ గతంలో కంటే ఈ రబీలో నల్గొండ జిల్లాలో అత్యధిక ధాన్యం పండిందని ,గతం తో పోలిస్తే 30000 మెట్రిక్ టన్నుల ధాన్యం అధికంగా పండినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలులో ఏర్పడిన హమాలి, ట్రాన్స్పోర్ట్ సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు.ఏఎంఆర్పి కాలువల లైనింగ్ కోసం 450 కోట్ల రూపాయలను ఖర్చు చేయడం జరుగుతున్నదని, ఎస్ ఎల్ బి సి సొరంగం పూర్తయితే జిల్లాలో మరింత దాన్యం దిగుబడులు పెరుగుతాయి అన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫన్ రవీంద్ర, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఎస్ పి శరత్చంద్ర పవర్ ,రైతు కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్,అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్,స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి, డిసిఓ పత్యా నాయక్,పౌరరఫరాల జిల్లా మేనేజర్ రామ్ పతి నాయక్,డిఎస్ఓ వెంకటేశం,మార్కెటింగ్ శాఖ ఏడి ఛాయా దేవి,ఇతర అధికారులు,ప్రజా ప్రతినిధులు, తదితరులు మంత్రుల వెంట ఉన్నారు.



## వచ్చే మూడేండ్లలో ఇచ్చిన

# ప్రతి హామీని నెరవేరుస్తాం



**ప్రజాపక్షం/సూర్యాపేట (ఆత్మకూర్(ఎస్)) :** వచ్చే మూడేండ్లలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. మండలంలోని పాతర్లపహాడ్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారు అరెంపుల సరిత రాజు గృహ నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదోడి సొంతింటి కళను నెరవేర్చేందుకు ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తుందోన్నారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. పేద ప్రజల ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఉచితంగా ఇవ్వడం చరిత్రలోనే మొదటిసారి అని వాటిని ప్రతి ఒక్కరూ పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణ సౌకర్యం, పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్, రైతుబరోసా, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తుందని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి మీ గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామంలో 70 ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యాయని, త్వరలోనే మరో 20 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ఎవరికి ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదని, ఎవరైనా డబ్బులు అడిగితే నాకు చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు గణపరపు నారాయణ, జిల్లా అధికార ప్రతినిధి తన్నీరు పురుషోత్తం, నాయకులు అరెంపుల రాజు, గుంటూరు చిట్టిబాబు, గుండాల శ్రీశైలం, జటంగి ఎల్లయ్య, పలరవు అవిలయ్య, నీలం ప్రభాకర్ పాల్గొన్నారు.

## అభయాంజనేయస్వామి విగ్రహా ప్రతిష్ట

# మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/దేవరకొండ:** మండల పరిధిలోని గన్యానాయక్ తండాలో నిర్వహించిన శ్రీశ్రీ ఆభయాంజనేయ స్వామి విగ్రహా ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ నాయకులు మరియు ఆలయ కమిటి సభ్యులు ఎంఎల్ఏను శాలువాతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, ఆలంపల్లి నర్సింహా, మండల పార్టీ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, భద్యనాయక్, మాజీ జెడ్పిటిసి అరుణ సురేష్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు హరకృష్ణ, సర్పంచ్ గోపాల్‌నాయక్, జిల్లా నాయకులు మల్లారెడ్డి, సర్పంచ్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## అభయాంజనేయ స్వామి అనుగ్రహం ప్రతి ఒక్కరిపై ఉండాలి

**ప్రజాపక్షం/దేవరకొండ:** ప్రతి ఒక్కరు అభయాంజనేయస్వామి అనుగ్రహం పొందాలని దేవరకొండ మాజీ ఎంఎల్ఏ రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని గన్యనాయక్ తండాలో శ్రీశ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఏ రవీంద్రకుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటి సభ్యులు మాజీ ఎంఎల్ఏ రవీంద్రకుమార్‌ను సన్మానించారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కిషన్‌నాయక్, టివిఎన్‌రెడ్డి, సర్పంచ్ గోపాల్‌నాయక్, తులసిరాం, కృష్ణ, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## 24న రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నల్లగొండ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఈనెల 24న జిల్లా బ్యాడ్మింటన్ క్రీడాకారులను ఎంపిక చేస్తున్నట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.నవీన్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మిర్యాలగూడలో మాట్లాడుతూ అండర్ 11, 13, 15, 17, 19 మెన్ అండ్ ఉమెన్ క్రీడాకారులకు నిర్వహిస్తున్న ఈ పోటీలు మిర్యాలగూడలోని హౌసింగ్‌బోర్డులో గల క్లియో స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు సంబందిత వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు డాక్టర్ అంజయ్య, అధ్యక్షుడు ప్రశాంత్, శరణ్‌కుమార్ తదితరుల పాల్గొన్నారు.

## దాడిలో ఇద్దరికి గాయాలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండలంలోని ఊట్లపల్లి గ్రామానికి చెందిన కోటగిరి వెంకన్న తన ఇంటి వద్ద చిన్న షాపు నిర్వహించుకుంటూ జీవిస్తున్నాడు. కాగా ఈనెల 13న అర్ధరాత్రి తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన గుండు పవన్, గుండు మణికంఠ అనే వ్యక్తులు సిగిరెట్లు కావాలని అడగగా షాపు మూసివేసినట్లు బాధితుడు తెలిపాడు, ఆ సమయంలో వాగ్వాదం చోటుచేసుకోని అనంతరం వారు మరికొందరిని పిలిపించుకోని బాధితుని ఇంటి వద్దకు వచ్చి గొడవకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై ఊట్లపల్లి గ్రామానికి చెందిన కోటగిరి వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పట్టణలోని వెల్కమ్ నల్లగొండ బోర్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ డి.సైదాబాబు తెలిపిన వివరాల ప్రకారం నిడుమనూర్ మండలం రాజన్నగూడెంకు చెందిన బోల్లం లింగయ్య (40) కూలీ పనుల్లో భాగంగా గుగ్గినపల్లి హనుమంతరెడ్డితో కలిసి ద్విచక్రవాహనంపై మిర్యాలగూడ వైపు వస్తుండగా ఎంఎన్ఆర్ ఫంక్షన్ హాల్ వెళ్లే మార్గంలో వెనుక నుండి అతివేగంగా అజాగ్రత్తగా వచ్చిన కంటేనర్ డీకోట్టి లింగయ్య అక్కడక్కడే మృతి చెందాడని తెలిపారు. ద్విచక్రవాహనం నడుపుతున్న హనుమంతరెడ్డి ఎగిరి ఎడుమవైపు పడగా లింగయ్య కుడివైపు పడి కంటేనర్ వెనుకటైర్ కింద పడి నడుముపై వెళ్లడంతో కాళ్లు నుజ్జునుజ్జుఅయ్యి ప్రాణాలు విడిచాడని హనుమంతరెడ్డికి మాత్రం గాయాలు కావడంతో అసుపత్రి కి తరలించడంతో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. దీంతో మృతుని భార్య సైదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## ఎస్‌సి కార్పొరేషన్ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

**ప్రజాపక్షం/నకిరేకల్ :** 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న మున్సిపల్ పరిధిలోని ఎస్సీ నిరుద్యోగ యువతకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు, పాడి గేదెల యూనిట్ల మంజూరు కోసం అభ్యర్థుల అర్హతలను అధికారులు పరిశీలించారు. ఈ పథకం కింద వివిధ రకాల వ్యాపారాలు ఏర్పాటు చేసుకునేందుకు 90 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 73 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్ అబ్దుల్ రషీద్,మండల ప్రత్యేక అధికారి డాక్టర్ ఎస్. కిరణ్ కుమార్, వివిధ బ్యాంకుల మేనేజర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## వరి కొయ్యలను కాల్చొద్దు... భూసారాన్ని కాపాడుకుందాం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వరికోతల అనంతరం పొలాల్లో మిగిలిన కొయ్యలను తగులబెట్టడం వల్ల రైతులు స్వయంకృపరాదంతో భూమిని నిస్సారం చేసుకుంటున్నారని ఇన్‌చార్జి ఏడీఏ రుషేంద్రమణి అన్నారు. గురువారం మండలంలోని నందిపాడు గ్రామ పరిధిలో నిర్వహించిన రైతులకు అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ కొయ్యలను కాల్చడం వల్ల నేలలోని సేంద్రీయ పదార్థాలు పూర్తిగా నశించి మేలు చేసే వానపాములు, సూక్ష్మ జీవులు వేడికి మృత్యువాత పడుతాయని అన్నారు. దీని వల్ల గాలి ప్రసరణ తగ్గి, భూమి గట్టిపడి నీటి నిల్వ సామర్థ్యం దెబ్బతింటుందని వివరించారు. స్ట్రాంపర్ లేదా షెడ్డర్ యంత్రాలతో గడ్డిని ముక్కలు చేసి పొలంలో నీరు పెట్టి రోటవేటర్‌తో 25రోజుల వ్యవధిలో రెండుసార్లు దమ్ము చేస్తే అవి కుళ్లి భూమికి అద్భుతమైన ఎరువుగా మారుతాయని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు గోఫి, జ్యోతి, అఫ్రిన్, షఫి, రైతులు రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బండి సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలి

**ప్రజాపక్షం/గుండాల:** ఫోక్సో కేసు నిందితుడు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేసి బాధితురాలికి సత్వర న్యాయం చేయాలని సిపిఎం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటి సభ్యులు మద్దెపురం రాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గుండాల మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ నిందితుడిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు అయి ఐదు రోజులుదాటినా ఇప్పటి వరకు అరెస్టు చేయకపోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. మైనర్ బాదితురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడానికి వెళ్తే పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత దారుణంగా ఉందని ఆయన విమర్శించారు. బేటి బచావో బేటి పడావో అంటూ గొప్పలు చెప్పుకునే బిజెపి నేతలు దీనికి ఏం సమాధానం చెప్తారని ఆయన ప్రశ్నించారు. బాధితురాలికి అండగా నిలవాల్సిన ప్రభుత్వం, పోలీసులు నిందితులకు కొమ్ముకాయడం సరికాదని, ఇప్పటికైనా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిందితున్ని వెంటనే అరెస్టు చేసి, బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

## పదిలో టాపర్లకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/డిండి:** నల్గొండ జిల్లా డిండి మండలం చెరుకుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుదల లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈసమావేశంలో పదవ తరగతి ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల తరుపున ఘనంగా సన్మానించారు. మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన కాట్రావత్ ప్రభాస్, ద్వితియ స్థాయంలో నిలిచిన ముస్కాన్‌లను అతిథులు శాలువాలతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు పట్టుదలతో చదివితే అద్భుతాలు సాధించగలరని వక్తలు కొనియాడారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఇస్లావత్ గోప్యనాయక్ మాట్లాడుతూ విద్యార్థుల విజయాల్లో తల్లిదండ్రుల పాత్ర కీలకమని, నిరంతరం వారి చదువుపై పర్యవేక్షణ ఉండాలని సూచించారు. సర్పంచ్ మీసాల రామచంద్రయ్య మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని హామీ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, రిటైర్డ్ ఉపాధ్యాయులు మరియు గ్రామ విద్యావంతుడు శేఖర్‌రెడ్డి విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తూ క్రమశిక్షణ, కృషితోనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, ఎస్ఎంసి సభ్యులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం పలు సూచనలు చేశారు. తమ పిల్లల ప్రతిభను గుర్తించి గౌరవించినందుకు తల్లిదండ్రులు పాఠశాలకు హెడ్మాస్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## పండించిన పంట కొనే దిక్కులేక రైతుల ఆవేదన



**ప్రజాపక్షం/డిండి:** ఆరుగాలం కష్టపడి పండించిన పంట కొనే దిక్కులేక రైతులు ఆవేదన చెందుతున్నారని దేవరకొండ మాజీ ఎంఎల్ఏ రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గురువారం డిండి మండలం తవక్లాపూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రంను మాజీ ఎంఎల్ఏ రవీంద్రకుమార్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పులు తెచ్చి పంట పండిస్తే కొనే దిక్కులేక పోయారని అన్నారు. గన్ని బ్యాగులు ఇచ్చే పరిస్థితిలో ప్రభుత్వం లేదని అన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు ఎప్పుడూ వడ్ల కొనుగోలులో ఇంత ఆలస్యం కాలేదని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం రైతుల నుండి తరుగు పేరిట 2 కేజీలు, మిల్లర్లు 3కేజీల వడ్లు కట్ చేస్తున్నారని వాటిని వెంటనే ఆపాలని ఆయన అన్నారు. అధికారులు ఏం చేస్తున్నారు కొనుగోలు కేంద్రాల్లో తిరగాలని ఆయన సూచించారు. ఈప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటుందని పాలన చేతకాకుంటే రేవంత్‌రెడ్డి దిగిపోవాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారులతో ఫోన్లో మాట్లాడి తక్షణమే ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు రాజీనేని వెంకటేశ్వర్‌రావు, పిఏసిఎస్ చైర్మన్ మాధవరం శ్రీనివాస్‌రావు, సర్పంచ్ మల్‌రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు రవీందర్‌రావు, వెంకటయ్య, శ్రీను, తులసిరాం, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## సర్కార్ బడి.. చదువుల్లో మేటి!

**ప్రజాపక్షం/నకిరేకల్:** ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల్లో విద్యతో పాటు క్రమశిక్షణ,విలువలు,ప్రతిభను పెంపొందిస్తూ చదువుల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దుతున్నాయని నకిరేకల్ మండల విద్యాధికారి మేక నాగయ్య అన్నారు.గురువారం మండలంలోని తాటికల్ గ్రామంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉన్నత పాఠశాల,ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే సమగ్రాభివృద్ధికి అవసరమైన నాణ్యమైన విద్య అందుతుందని పేర్కొన్నారు.గ్రామ సర్పంచ్ బంటు రవి మాట్లాడుతూ తాటికల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పాటు ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ ఏడాది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని చెప్పారు.ఈకార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు ప్రజ్ఞాపురం వెంకన్న ఉపాధ్యాయులు డాక్టర్ సాగర్ల సత్తయ్య,లొట్లపల్లి కోటయ్య, నూకల జానయ్య, ప్రధానోపాధ్యాయులు ఎల్ రమణారావు,కానుగుల చంద్రకళ, అలుగుబెల్లి ఉమారాణి,ఏ హరికృష్ణ, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ మేడ కొండల్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ కార్యకర్తపై దాడి అమానుషం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** టిఆర్ఎస్ కార్యకర్త వార్డు సభ్యులు ఆల్ దాస్ సతీష్ గౌడ్‌పై కాంగ్రెస్ శ్రేణులు దాడి అమానుషమని గొర్రెల మేకల పెంపకం దారుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ దూదిమెట్ల బాలరాజు పేర్కొన్నారు. గురువారం కేతపల్లి మండలం చీకటి గూడెం గ్రామంలో సతీష్ గౌడ్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అంతకు ముందు సూర్యాపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సతీష్ గౌడ్ ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాడిన సాగుతుందని మండిపడ్డారు. రాజకీయ కక్షలతో బిఆర్ఎస్ కార్యకర్తలే లక్ష్యంగా దాడులు చేయడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే కాంగ్రెస్ చిల్లరమూకలు రెచ్చిపోతున్నాయని దూదిమెట్ల ధ్వజమెత్తారు.ఆయన వెంట సతీష్ గౌడ్ బార్య మంజుల,తండ్రి ఎల్లయ్య తో పాటు చీకటి గూడెం గ్రామ బిఆర్ఎస్ నాయకులు నల్లపు లింగయ్య, నల్లపు నాగేశ్వర్ రావు, మధు,కోట సంపత్ రావు పాల్గొన్నారు.

## మందడి మురలమ్మకు గుత్తా అమిత్ రెడ్డి నివాళులు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మందడి మధుసూదన్ రెడ్డి మాతృమూర్తి మందడి మురలమ్మ దశదిన కార్యక్రమం గురువారం నల్గొండలో జరిగింది.తెలంగాణ విజయ డెయిరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి హాజరై మురలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో కరుణాకర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, హరి కృష్ణ, రాంప్రసాద్ పాల్గొన్నారు.

## కందాల కుటుంబాన్ని పరామర్శించిన జగదీశ్‌రెడ్డి



ప్రజాపక్షం/నకిరేకల్ : పట్టణ కేంద్రంలోని ఏపీఎం విద్యాసంస్థల అధినేత కందాల పాపిరెడ్డి సతీమణి కందాల లక్ష్మీ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా ఉద్యమ నాయకులు చెరుకు సుధాకర్, గ్రంథాలయ చైర్మన్ రెగ్గటే మల్లికార్జున్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నలగాటి ప్రసన్నరాజ్ బీఆర్ఎస్ నాయకులు సిలివేరుప్రభాకర్, చెరుకు వెంకటాద్రి, చౌగోని శంకర్ యతాకుల సోమయ్య వీర్లపాటి రమేష్, నర్సింహ్మారావు, మామిడి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## నోములలో బడిబాట కార్యక్రమం


ప్రజాపక్షం/నకిరేకల్ : మండలంలోని పీఎంశ్రీ ఎంపీపీఎస్ నోముల ప్రభుత్వ పాఠశాలలో పీటీఎం సమావేశం, బడిబాట కార్యక్రమాన్ని ర్యాలీ గురువారం నిర్వహించారు. సర్పంచ్ పొట్లబత్తుల జయమ్మ, వెంకటేశం, మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి విద్య అవసరమని, పిల్లలను ప్రతిరోజూ పాఠశాలకు పంపాలని కోరారు. పాఠశాలలో యోగా,కరాటేతో పాటు ఈ ఏడాది కంప్యూటర్ విద్యను కూడా అందిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలోప్రధానోపాధ్యాయులు పోక ప్రసాద్, చైర్మన్ స్వప్న, ఉపాధ్యాయులు ఉదయశ్రీ, సునిత, రవి, స్రుజన, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భూగర్భజలాల పెంపుకు ప్రతి ఒక్కరు కృషి



ప్రజాపక్షం/మిర్యాలగూడ: భూగర్భజలాల పెంపుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంపీడీవో ఎం.శేషగిరిశర్మ అన్నారు. గురువారం మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో జలసంచాయ్ జన్ భగీరథ ప్రచార జాత నీటి ప్రాధాన్యత పాటల రూపంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి పొదుపులో భాగంగా వర్షపు నీటిని ఒడిసిపట్టుట భూగర్భజలాల మట్టాన్ని పెంచుట, ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలన్నారు. గుట్టలపై కందకాలు తవ్వడం, చెరువులు, కుంటల్లో పూడిక తీత ద్వారా భూగర్భజలాల పెంపు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆవుల మల్లారెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, టీపీలాలు తదితరులు ఉన్నారు.

## అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



ప్రజాపక్షం/సూర్యాపేట : పట్టణ అభివృద్ధిలో కౌన్సిలర్లు పార్టీలకతీతంగా భాగస్వాములు కావాలని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం రాత్రి జిల్లా కేంద్రంలోని వైట్‌హౌస్‌లో 19వ వార్డు కౌన్సిలర్ పిడమర్తి కీర్తి లవన్ బిజెపి పార్టీకి రాజీనామా చేసి పలువురు నాయకులు, కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, మున్సిపల్ చైర్‌పర్సన్ పోతు భాస్కర్‌లు వారికి మూడు రంగుల కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజాప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరుతున్నారని చెప్పారు. జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో సూర్యాపేట జిల్లాలో అభివృద్ధి, సంక్షేమంలో జోడెడ్లుగా పరుగులు పెడుతున్నాయని అన్నారు. సూర్యాపేట నియోజక వర్గంలో అన్ని సమస్యలను ఇప్పటికే గుర్తించామని వాటిని పరిష్కరించేందుకు జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రఘువీర్ రెడ్డిల సహకారంతో భారీ ఎత్తున నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం కౌన్సిలర్ పిడమర్తి కీర్తి లవన్ మాట్లాడుతూ వార్డు అభివృద్ధి కోసం అధికార పార్టీతో పాటు మున్సిపల్ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి సారథ్యంలో పనిచేసేందుకు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. ఆమెతోపాటు మరో వంద మంది కార్యకర్తలు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీఉల్లా, కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, గునగంటి హేమ సతీష్, కుమ్మరి కుంట్ల వేణుగోపాల్, నెమ్మికల్ శ్రీదండుమైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగెళ్ళ కరుణాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు అంజద్‌అలీ, నాయకులు అబ్దుల్ రహీం, బాలు గౌడ్, మాజీ కౌన్సిలర్లు నిమ్మల వెంకన్న పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల బాధ్యత అత్యంత కీలకం




ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : బీఎడ్ విద్యార్థులు రేపటి ఉపాధ్యాయులుగా సమాజ మార్పుకు మార్గదర్శకులు, దీపస్తంభాలుగా ఎదగాలని ఆచార్య మృణాళిని పిలుపునిచ్చారు.గురువారం మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో ప్రజా పాలప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన విద్యా వారోత్సవాల్లో బీఎడ్ అధ్యాపకులకు సిలబస్ మూల్యాంకనంపైఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.భవిష్యత్ తరాల తలరాతను మలచడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని,మారుతున్న సాంకేతికతను దృష్టిలో ఉంచుకుని సిలబస్‌ను తీర్చిద్దాలన్నారు. ఉపాధ్యాయ విద్య సిలబస్‌ను జాతీయ విద్యా విధానం, కొత్త పాఠ్యాచర్య ప్రకారం నిరంతరం సమీక్షించి పునర్ రూపకల్పన చేయడం అవసరమని స్పష్టం చేశారు.కొత్త సిలబస్‌ను తరగతి గదిలో జీవంతం చేసే శక్తి ఉపాధ్యాయుల్లోనే ఉందని, వారి బోధనా శైలి, విలువల బోధన, సహానుభూతితోనే విద్యార్థుల్లో సృజనాత్మకత, నైతిక విలువలు వికసిస్తాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి,డాక్టర్ ప్రసన్నకుమార్, డాక్టర్ సుజాత,బీఎడ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు,అధ్యాపకులు పాల్గొన్నారు.

## ధాన్యం సేకరణలో ప్రభుత్వం విఫలం



ప్రజాపక్షం/తుంగతుర్తి : ధాన్యం సేకరణలో రాష్ట్రములోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తాటికొండ సీతయ్య విమర్శించారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్లాల్లో ధాన్యం పోసి నెల రోజులుదాటినా ఇప్పటి వరకు పావువంతు ధాన్యాన్ని కూడా ప్రభుత్వం సేకరించలేకపోయిందని మండిపడ్డారు. లారీలు సక్రమంగా కేంద్రాలకు రాకపోవడం, లోడింగ్ చేసి పంపిన లారీ మిల్లుల వద్ద సకాలంలో దిగుమతులు కాకపోవడం మూలాన రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదన్నారు. ములిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా మిల్లు యజమానులు తాలు, తరుగు పేరుతో కిలోల కొద్ది కోతలు పెడుతుండడంతో రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. గత పదేండ్ల కెసిఆర్ పాలనలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతు ఆనందంగా జీవించారన్నారు. కాంగ్రెస్‌ను నమ్మి ఓట్లేస్తే నట్టేట ముంచిందని రైతులు నెత్తి నోరు బాదుకుంటున్న పరిస్థితులు ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పల నాగమల్లు, యాకు నాయక్, పూర్ణ నాయక్, రాములు నాయక్, నల్లబెల్లి వెంకటేష్ పాల్గొన్నారు.

## ఎన్‌జీ కళాశాలలో మెగా మెడికల్ క్యాంప్



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: నాగార్జున ప్రభుత్వ కళాశాలలో ప్రజా పాలప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో గురువారం ఉచిత వైద్య శిబిరం, పూర్వ విద్యార్థుల సమ్మేళనం, ప్రయోగశాలల సందర్శన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.విద్యార్థులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ జయంత్,డాక్టర్ శివాజీ,డాక్టర్ ఇమ్రాన్,డాక్టర్ నౌషిన్ బృందం మధుమేహం,బీపీ తదితర పరీక్షలు నిర్వహించారు.అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించి ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు.పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కళాశాలలో చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు పాల్గొని తమ అనుభవాలు పంచుకున్నారు. కళాశాల అభివృద్ధికి సహకరిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కళాశాలలోని అధునాతన సైన్స్,కంప్యూటర్ ప్రయోగశాలలను సందర్శించారు.ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి,సమాజానికికళాశాలకు మధ్య వారధిగా ఉపయోగపడతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ అన్నారు. కార్యక్రమంలోసమన్వయకర్త డాక్టర్ పరంగి రవికుమార్,వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫసర్ అంతటి శ్రీనివాసులు,అకాడమిక్ కోఆర్డినేటర్ బత్తిని నాగరాజు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

## విద్యాప్రమాణాలకు ప్రభుత్వం చర్యలు

ప్రజాపక్షం/చింతలపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడేందుకు ప్రజాప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నందిరెడ్డి ఇంద్రారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్, పిఏసిఎస్ చైర్మన్ వేమూలూరి రంగాచారి, షేక్ సొందుమియా, ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, వీఓఏలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌ను పరామర్శించిన సర్వోత్తమ్ రెడ్డి

ప్రజాపక్షం/చివ్వెంల : అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని అక్కలదేవిగూడెం గ్రామ సర్పంచ్ అమరగాని అంజయ్యను గురువారం ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి పరామర్శించారు. అనారోగ్యం నుండి బయటపడేందుకు డాక్టర్ల సలహాలు తీసుకొని తొందరగా కోలుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ధరావత్ వీరన్న నాయక్, నాయకులు అబ్దుల్ రహీం, యండి అంజద్‌అలీ, నాగుల వాసు, చిలుముల సునీల్ రెడ్డి, తంగెళ్ళ కరుణాకర్ రెడ్డి, ఏలిమినేటి అభినయ్, భూక్య శివ నాయక్, నాగు నాయక్, పడిదల రవి, చెంచల నిఖిల్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

ప్రజాపక్షం/మోతె : మండల కేంద్రానికి చెందిన చర్లపల్లి చరణ్ (22), దోసపాటి కళ్యాణ్ (23) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సీలేరులో బైక్‌పై వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయాలు కావడంతో చరణ్ ఘటనా స్థలంలో మృతి చెందగా, కళ్యాణ్ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వివరించారు.

## రామచంద్రరావును కలిసిన కేతావత్ భాస్కర్ నాయక్

ప్రజాపక్షం/తిరుమలగిరి(సాగర్): తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావును రాష్ట్ర బిజెపి ఎస్టి మోర్చా అధికార ప్రతినిధి కేతావత్ భాస్కర్ నాయక్ గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ప్రధాని మోడీ సభ విజయవంతం కావడంతో ఆయనకు ధన్యవాదాలు తెలిపి శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో నాగార్జునసాగర్ నియోజకవర్గంలో బిజెపి బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి యువతను పార్టీతో కలిసి పనిచేసేలా చూడాలని కోరారు.

## విద్యార్థుల విజయానికి పేరెంట్స్ పాత్ర కీలకం

ప్రజాపక్షం/నకిరేకల్ : విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నకిరేకల్ ప్రధానాచార్యులు ప్రొఫసర్ బెల్లి యాదయ్య అన్నారు. విద్యావారోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు అభ్యసన సమస్యలు, కెరీర్ ఎంపికలో అయోమయాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో తల్లిదండ్రులు, అధ్యాపకుల సమన్వయంఅవసరమన్నారు. ఇలాంటి సమస్యల పరిష్కారానికి పేరెంట్స్ సమావేశాలుఉపయోగపడతాయని తెలిపారు పిల్లల సామర్థ్యాలకు, తల్లిదండ్రుల ఆశలకు మధ్య వ్యత్యాసం ఉన్నందున ఇలాంటి సమావేశాలు అవసరమని అన్నారు.ఈకార్యక్రమానికి ఎకనామిక్స్ సహాచార్యులు కె.హరిత అనుసంధానకర్తగా వ్యవహరించగా వైస్ ప్రిన్సిపాల్ నాగు,సరస్వతీ హైస్కూల్ కరస్పాండెంట్ నర్సయ్య అధ్యాపకులు ప్రవీణ్‌రెడ్డి,డా.శ్రీనివాసాచారి, శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ శంకర్, శివశంకర్,ఉపేందర్,రవీందర్,నర్సింహాచారి, విద్యార్థులు పాల్గొన్నారు.

# మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

**ప్రజాపక్షం/రామన్నపేట :** స్థానిక పట్టణ కేంద్రం సుభాష్ సెంటర్‌లో బిజెపి మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్ర మోడీకి రైతులు పండించిన పంటలకి మద్దతు ధర పెంచినందుకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నకిరేకల్ ఇంచార్జ్ నకిరేకంటి మొగులయ్య, మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ దుర్గయ్య ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ నరేంద్ర మోడీ గత 12 సంవత్సరాలుగా రైతులని రాజుగా చేయడమే ప్రధాన లక్ష్యంగా భారతదేశంలో రైతులకి లాభసాటి వ్యవసాయం అందించడమే ప్రధాన కర్తవ్యంగా పనిచేస్తున్న ప్రభుత్వం నరేంద్ర మోడీ ప్రభుత్వమని, దేశంలో మనిషికి ఇన్సూరెన్స్ అనేది ఎంత అవసరమో రైతుకి పంటకి కూడా ఇన్సూరెన్స్ అంటే పసల్ బీమా యోజన అవసరమని, దేశంలో రైతులకి మొట్టమొదటిసారిగా పసల్ బీమా యోజన తీసుకొచ్చి రైతులకు మేలు చేయడం జరిగిందని, కానీ మన తెలంగాణ రాష్ట్రంలో గత కెసిఆర్ ప్రభుత్వం కానీ, ఇప్పుడున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం గానీ దాన్ని అమలు కాకుండా రైతులని మోసం చేస్తున్నటువంటి పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ నెంబర్ వనం అంజయ్య, బిజెపి సీనియర్ నాయకులు దోగుపర్తి సుభాష్, కట్ట యాదయ్య, బీజేవైఎం జిల్లా కార్యదర్శి అక్కినపల్లి సైదులు, మండల ప్రధాన కార్యదర్శి బెజ్జంకి శివకుమార్, మండల ఉపాధ్యక్షులు బట్టే రమేష్, మండల కార్యదర్శి బతక్క నరేష్, రేపాక లింగ స్వామి, బిజెపి నాయకులు గోపగోని అశోక్ గౌడ్, రేఖ నరసింహాల్, పండుగ అశోక్, సురివి శేఖర్, ఏనూతుల సురేష్, చేరుకు గణేష్, మెడబోయిన కృష్ణ, అక్కెనపల్లి రాము, గౌరిగే సైదులు, ఎర్ర బోయిన వెంకటేష్, మెడ బోయిన ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రొఫెసర్ జయశంకర్‌సార్ బడిబాట ప్రారంభం

**ప్రజాపక్షం/పాలకవీడు:** ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 14వ తేదీ నుండి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి కాటయ్య తెలిపారు. గురువారం మండల కేంద్రంలో బడిబాట కార్యక్రమాన్ని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని ఇటీవల జరిగిన ఎస్ఎస్‌సి పరీక్షలలో ప్రైవేట్ విద్యార్థులకు ధీటుగా సత్తాన్ని చాటారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం మౌళిక సదుపాలయ కల్పనకు కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్, శ్రీనివాసరెడ్డి, స్వప్న, రహమతున్నీషా, నరేష్ పాల్గొన్నారు.

## వేసవిలో త్రాగునీటి సమస్య రాకుండా చర్యలు

**ప్రజాపక్షం/అర్వపల్లి:** గ్రామంలో వేసవిలో త్రాగునీటి సమస్య రాకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు గ్రామ సర్పంచ్ కర్నాటి వెంకన్న అన్నారు. గురువారం మండలంలోని రామన్నగూడెం గ్రామంలో చెలిమబావి పూడికతీత, మరమ్మత్తు పనులను ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో శాశ్వత త్రాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యంగా చెలిమబావి మరమ్మత్తు పనులను చేపట్టామని తెలిపారు. గ్రామంలో ఉన్న వనరులను వినియోగించుకొని గ్రామాభివృద్ధి కోసం పాటుపడుతన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లింగంపల్లి రవీందర్, పంచాయితీ కార్యదర్శి సుధాకర్, వార్డు సభ్యులు మర్రి లతీఫ్, తవిటి సైదులు, ముఢావత్ తనేష్, నాయకులు పాల్గొన్నారు.

## అవయవ దానం సమాజానికి మార్గదర్శకం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** అవయవ దానం సమాజానికి మార్గదర్శకమని స్పందన అవయవదాన సంస్థ అధ్యక్ష కార్యదర్శులు గుండా రమేష్, మిట్టకోల కోటయ్య, కోశాధికారి హెచ్. పిచ్చిరెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో నివాసం ఉంటున్న వలవోజు రమేష్ తన మరణానంతరం వైద్య విద్యార్థుల పరిశోధన నిమిత్తం అవయవ దానానికి తన అంగీకారాన్ని తెలియజేస్తూ అంగీకార పత్రాన్ని సంస్థ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన అనారోగ్యం దృష్ట్యా దివంగతులైన పిదప సమాజానికి మార్గదర్శకంగా ఉండాలని సత్సంకల్పంతో అవయవదానానికి అంగీకరించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వలవోజు వెంకన్న, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పదవులు నియమించడాన్ని వ్యతిరేకిస్తున్నామని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోప్పోజు సూర్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. గురువారం నేరేడుచర్ల తహసిల్దార్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘ ఆధ్వర్యంలో తహసిల్దార్ సైదులుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా ప్రతి సహకార సంఘంలో 13 మంది సభ్యుల పేర్లను పాలక వర్గమైన కాంగ్రెస్ పార్టీ వ్యక్తులకు అధ్యక్ష, డైరెక్టర్ పదవులతో నామినేట్ చేసుకోవడానికి అన్ని ప్రాంతాల నుంచి పేర్లను సేకరించాలని అన్నారు. భారత ప్రభుత్వం గ్రామీణ సహకార రుణ వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రొఫెసర్ వైద్యనాథన్ ప్రకారం ప్రాథమిక సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కత్తి శ్రీనివాసరెడ్డి, చిలకరాజు శ్రీను, ఏ లక్ష్మి , ఊదర వెంకన్న, కొమ్మరాజు వెంకట్, బత్తిని శ్రీనివాస్, దొమకొండ మనోజ్, చంద్రారెడ్డి, నర్సిరెడ్డి, ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.




## సతీష్ చంద్ర చేసిన సేవలు మరువలేనివి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఎగ్జిక్యూటివ్ ఇంజనీరిగా మద్దెపురి సతీష్ చంద్ర యాదవ్ ఆ శాఖకు అందించిన సేవలు మరువలేనివని తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఫిర్యాదుల అథారిటీ సభ్యులు డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు కొనియాడారు.సతీష్ చంద్ర ఇటీవల కాల్వ ప్రమాదంలో మరణించడంతో గురువారం నల్లగొండలోని బండారు గార్డెన్లో జరిగిన సంతాప సభ లో వర్రె వెంకటేశ్వర్లు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అదేవిధంగా వారి కుటుంబ సభ్యులు సతీష్ చంద్ర భార్య మద్దెపురి ప్రవళిక,కూతుర్లు మీనాక్షి,హరిణి లను పరామర్శించి ఓదార్చారు.అనంతరం ఆయన మాట్లాడుతూ సతీష్ చం ద్ర నిర్వహించిన శాఖలో ఉత్తమ సేవలు అందిస్తూ ఉన్నతాధికారులతో పేరు ప్రతిష్టలు పొందారని తెలిపారు.అదే విధంగా యాదవ కులాన్ని ప్రోత్సహిస్తూ సంఘ భవన నిర్మాణానికి 15 లక్షలు విరాళంగా ఇవ్వడం జరిగింది అన్నారు.ఆయన ప్రమాదంలో చనిపోవడం దురదృష్టకరమని అన్నారు.ఆయన మరణం యాదవ సంఘానికి తీరనిలోటని పేర్కొన్నారు.యాదవ సంఘం వారి కుటుంబానికి అండగా ఉంటుందని తెలిపారు.ఆయన వెంట యాదవ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు పల్లెబోయిన కాన్సి రాములు,సీనియర్ అడ్వకేట్ శ్యాంసుందర్, ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణ, తరాల పరమేష్, పర్వతాలు, రావుల బిక్షం ఉన్నారు.



## ఉర్దూ పాఠశాల భవనానికి మంత్రి కోమటిరెడ్డి రూ.కోటి మంజూరు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రభుత్వ మాన్యం చల్క ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలకు సొంత భవన నిర్మాణం కోసం రాష్ట్ర రోడ్లు,భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రూ.కోటి నిధులు మంజూరు చేశారు.రాష్ట్ర విద్యాశాఖ విద్యా వారోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఏఏపీసీ చైర్‌పర్సన్ కత్తుల రూప ఈ విషయాన్ని వెల్లడించారు.గత 66 ఏళ్లుగా పాఠశాల అద్దె భవనంలోనే కొనసాగుతోందని,కనీస సౌకర్యాలు లేని ఇరుకైన గదుల్లో బోధన సాగుతోందని తెలిపారు.పరిస్థితిని గమనించిన మంత్రి స్థలం కేటాయించడంతో పాటు రూ.కోటి నిధులు మంజూరు చేశారని చెప్పారు.మొదటి దశలో రూ.40లక్షలతో త్వరలో భవన నిర్మాణం ప్రారంభమవుతుందని, రెండో దశలో మరో రూ.60 లక్షలు విడుదల చేసి మొత్తం 8 గదులు నిర్మిస్తారని వివరించారు.బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆవాస ప్రాంతంలోని బడి ఈడు పిల్లలందరినీ గుర్తించి ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలలోనే చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కత్తుల రూప కోరారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు యండి షాహిన్ తయ్యబ్,ఉపాధ్యాయులు,పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## ఈతకు వెళ్లి చెరువులో మునిగి బాలుడు మృతి

**ప్రజాపక్షం/మునుగోడు:** ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తూ చెరువులో మునిగి 13 ఏళ్ల బాలుడు మృతి చెందిన ఘటన మునుగోడు మండలం పులిపాపల గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన కాయిత లక్ష్మణ్ కుమారుడు అఖిల్ ఉదయం 11.30 గంటల సమయంలో తన స్నేహితుడు గోలి గణేష్‌తో కలిసి గ్రామ శివారు చెరువులో ఈత నేర్చుకునేందుకు వెళ్లాడు. ఈతకు దిగిన క్రమంలో అఖిల్ నీట మునిగి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.



## మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి

**ప్రజాపక్షం/నల్లగొండ(దామరచర్ల) :** మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని మ త్స్యపరిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు నూకల అంజయ్య ముదిరాజ్ అన్నారు.గురువారం మండలంలో నిర్వహించిన మ త్స్యపారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల్లో నూకల అంజయ్యముదిరాజ్ ప్యానెల్ విజయం సాధించింది.మొత్తం తొమ్మిది మంది లో అంజయ్య ప్యానల్ నుంచి 8 మంది విజయం సాధించి అధ్యక్షునిగా అంజయ్య ముదిరాజ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోగా ఉపాధ్యక్షులుగా బుడిగే లక్ష్మయ్య,కార్యదర్శిగా తోకల బాల,సభ్యులుగా వాడపల్లి శ్రీరాములు,నూకల రాము, తోకల బాల సైదులు,మొరం ఆదెమ్మ,తోకల వెంకటమ్మల ను నియమించడం జరిగింది.అనంతరం నూతన అధ్యక్షుడు అంజయ్య ముదిరాజ్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా తన మీద నమ్మకంతో తనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అన్నారు. ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికై కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## రైతులకు బోరు బావులకు మరమ్మతులు

**ప్రజాపక్షం/నడిగూడెం:** మండలంలోని వల్లాభపురం గ్రామంలో తాగునీటి సమస్యను, సర్పంచ్ కేశగాని సరిత లక్ష్మ ణ్ పరిష్కరించడం జరిగిందని, వేసవికాలం కావడం వల్ల తాగునీరు సమస్య లేకుండా గ్రామంలోని నాలుగు సెంటర్లలో పాడైన బోర్లు, బావులకు మరమ్ముతుల చేయాలని జరిగింది. గురువారం మండలంలోని తహసిల్దార్ కార్యాలయంలో సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పాడైన బోరు బావులకు మరమ్ముతులు చేయించడంలో గ్రామస్తులు సర్పంచ్‌కు ధాన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లారెడ్డి, వార్డు నెంబర్లు షేక్ లెనిన్, కొమ్ము పుల్లయ్య, కిన్నెర నాగమణి, నారాయణరెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

## వార్డు సమస్యల పరిష్కారానికి కృషి

**ప్రజాపక్షం/కోదాడ:** మున్సిపాలిటి పరిధిలోని 26వ వార్డులో అభివృద్ధికి అనిన విధాలుగా కృషిచేస్తానని ఆ వార్డు కౌన్సిలర్ నెహనాజ్ బషీర్ అన్నారు. గురువారం వార్డులో వేసవిలో నీటి ఎద్దడ నివారణకు సొంత ఖర్చులతో వాటర్ ట్యాంకర్‌ను ఏర్పాటు చేసి మైనార్టీ కార్పొరేషన్ స్టేట్ వైస్ చైర్మన్ బషీర్‌లతో కలిసి ప్రారంభించారు. వార్డు ప్రజలకు ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకరావాలని కోరారు. వార్డు అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీనాయకులు వైస్ చైర్మన్ షేక్ జబ్బార్, బషీర్‌ల పాల్గొని మాట్లాడారు. వార్డు ప్రజలకు ఏ సమస్య దృష్టికి తీసుకవచ్చిన వెంటనే కట్టుబడి పనిచేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎం కార్ఖూ, ఫ్రూట్ అసోసియేషన్ అధ్యక్షులు బాలచంద్రబోస్, ముస్తాఫా, గన్నేమియా, ముక్తి హతిరార్, శ్రీరంగం ప్రమీల, కాసర్ల రాజు, మైనార్టీ నాయకులు బాగ్దాద్, చాంద్‌పాషా, కాసర్ల రాజు, మక్తి హతరార్, శ్రీరంగం ప్రమీల, కాసర్ల రాజు, బాగ్గాద్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## సిరిపురం గ్రామంలో బడిబాట కార్యక్రమం




**ప్రజాపక్షం/రామన్నపేట :**మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో గురువారం నిర్వహించిన 'బడిబాట' కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకు సర్పంచ్ అంబటి ఉపేంద్ర రవీందర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఒక గ్రామం సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే ఆ గ్రామంలోని ప్రజలందరూ విద్యావంతులు కావాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్యను, ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 'మన ఊరు మన బడి' వంటి కార్యక్రమాల ద్వారా పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మూడుదూడ్ల అనూష రమేష్, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానేశ్వర్, ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులు నవీన్ కుమార్, కంకాల మల్లేశం, వార్డు సభ్యులు జెల్ల సూర్యకళ, పున్న వెంకటేష్, మోటే సామి, పటుడాల లక్ష్మి, గాదె యాదగిరి, పంచాయతీ సిబ్బంది తుంగ యాదగిరి, హరీష్, ఆశ వర్కర్లు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్న మోడీ ప్రభుత్వం



**ప్రజాపక్షం/రామన్నపేట :**నీట్ పరీక్ష నిర్వహణలో వరుసగా జరుగుతున్న వైఫల్యాలకు బిజెపి ప్రభుత్వం బాధ్యత వహించాలని విద్యార్థుల జీవితాలతో ఆటలాడొద్దని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం అన్నారు. నీట్ పరీక్ష లీకేజీ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక సుభాష్ సెంటర్లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకే దేశం ఒకే పరీక్ష అనే నినాదంతో కేంద్రం తీసుకువచ్చిన ఈ విధానం రాజ్యాంగ సమైక్య స్ఫూర్తికి విఘాతం కల్పిస్తుంది. ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యారంగాన్ని రాష్ట్రాలకు వదిలేయకుండా కేంద్రం తన గుప్పిట్లో పెట్టుకుని లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని అన్నారు. రాజస్థాన్లో నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన బిజెపి యువ నాయకుడు సోదరుడిని కఠినంగా శిక్షించాలని విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూరల నరసింహ చారి, కందుల హనుమంతు, మండల కమిటీ సభ్యులు గొరిగే సోములు, తొలుపునూరి శ్రీనివాస్, నీల అయిలయ్య, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గడ్డపాక శివకుమార్, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మెట్టు శ్రవణ్ కుమార్, పట్టణ కార్యదర్శి మునికుంట్ల లెనిన్, పల్లె సత్యం, బావాండ్లపల్లి సత్యం, గట్టు ఉపేందర్, గంజి అశోక్, అప్పం సంతోష్, తరిగొప్పుల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబ సభ్యుల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలి



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :**జనగణన2027 గృహగణన కార్యక్రమంలో భాగంగా ప్రతి కుటుంబానికి సంబంధించిన సభ్యుల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. గురువారం భువనగిరి మం డలం అనంతారం గ్రామంలో సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్లు నిర్వహిస్తున్న గృహగణన సర్వేను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి వివరాల నమోదు ప్రక్రియ, హౌస్ లిస్టింగ్ విధానం, కుటుంబాల వివరాల సేకరణ తదితర అంశాలను పరిశీలించి సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జనగణన 2027 అత్యంత కీలకమైందని తెలిపారు. సర్వే నిర్వహిస్తున్న ఎన్యూమరేటర్ల జనగణన నమోదు చేసేటప్పుడు తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. అందువల్ల ప్రజలు తమ కుటుంబ సభ్యుల వివరాలను సరైన విధంగా అందించి సహకరించాలని కోరారు. అధికారులు, ప్రజల సమన్వయంతో జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహం



**ప్రజాపక్షం/మోటకొండూర్ :**మోటకొండూర్ మండలంలో అమ్మనబోలు, ముత్తిరెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో ఇటీవల జరిగిన పదవ తరగతి ఫలితాలలో వల్లాల మహేశ్వరీ 559 మార్కులతో మండల స్థాయి రెండవ స్థానం, పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానం సాధించగా ఆ పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు వడ్డెపల్లి సదర్శన్ రూ.5 వేల ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందించగా, ముత్తిరెడ్డిగూడెంలో ప్రముఖ ఎన్ఆర్ఐ చాడ సాయి కిరణ్ తరుపున చాడ శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటర్ రెండవ సంవత్సరంలో 990/1000 మార్కులు సాదించిన మంచాల దీక్షితకు 5 వెలు, ప్రథమ సంవత్సరంలో 459/470 మార్కులు సాదించిన అన్నెబోయిన గణేష్కు 2500, పదవ తరగతిలో 538/600 మార్కులు సాదించిన దుంప సంధ్యలకు 2500 రూపాయలు ప్రోత్సాహంగా అందించారు. పదవ తరగతిలో ప్రభుత్వ పాఠశాలలో పాసైన ముందర విద్యార్థులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమాలలో ప్రధానోపాధ్యాయులు శైలజ రాణి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోమయ్య, సర్పంచ్ లు మామిడి నర్సమ్మ,బుడిగె బాలరాజు,చాడ శశిధర్ రెడ్డి, మంచాల సత్యనారాయణ, అన్నెబోయిన నాగయ్య, గంధమల్ల పాండు, సొప్పరి నర్సింహా, వార్డు సభ్యులు విద్యార్థులు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

## బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలి : సిపిఎం డిమాండ్




**ప్రజాపక్షం/మోటకొండూర్ :**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ను ఫోక్సో చట్టం కింద వెంటనే అరెస్టు చేసి ఉరితీయాలని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ ఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బోలగాని జయరాములు డిమాండ్ చేశారు. ఆయన మోటకొండూరు సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథును వెంటనే అరెస్టు చేయాలని ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 17 సంవత్సరాల మైనర్ బాలికపై అత్యాచారం చేసి తప్పించుకొని తిరుగుతున్న బండి భగీరథను ఎందుకు అరెస్టు చేస్తలేరని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ యంత్రాంగం నిర్లక్ష్యం వీడి అరెస్టు చేయాల్సిన బాధ్యత తీసుకోవాలని సామాన్యులకు ఒక న్యాయం, కేంద్ర మంత్రి కొడుకుకు ఒక న్యాయమా అని విమర్శించారు. న్యాయపరమైన విచారణ పారదర్శకంగా నిర్వహించాలని మైనర్ బాలికకు న్యాయం చేయాలని బాధిత కుటుంబానికి తక్షణమే పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి, మండల కార్యదర్శి కొల్లూరు అంజనేయులు, సిహెచ్ రోమన్, టౌన్ కార్యదర్శి వడ్డేబోయిన మహేందర్, గోసంగి పరమేశ్వర్, బైరపాక సర్వయ్య, కొల్లూరి శ్రీహరి, కాదూరి నరసింహ, చెరుకు అనిల్, బొట్ల మైసయ్య పాల్గొన్నారు.

## ఫార్మేషన్ రోడ్డు పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/మోటకొండూర్ :**మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మండలంలోని ఆబిద్ నగర్ నుండి కిషన్ గూడ పంచాయతీరాజ్ రోడ్డు వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర ఫార్మేషన్ రోడ్డు పనులు ఆబిద్ నగర్ సర్పంచ్ నాయిని అమరావతి రామచంద్రారెడ్డి, అమ్మనబోలు సర్పంచ్ మామిడాల నరసమ్మ మల్లయ్యల ఆధ్వర్యంలో కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ భావుల దగ్గరికు వెళ్లేందుకు ఈ ఫార్మేషన్ రోడ్డు ద్వారా దగ్గర అవుతుందని తెలిపారు. వర్షాకాలం దగ్గర పడుతున్నందున కూలీలు ఎక్కువ మొత్తంలో హాజరై ఫార్మేషన్ రోడ్డును త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్లు కోల కృష్ణ, సాయిరెడ్డి క్రిష్ణా రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ బండి రమేష్ గ్రామస్తులు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం




**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :**ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'మన ఊరు మనబడి 'జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి పిలుపునిచ్చారు. ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గ్రామ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సౌకర్యాలు నాణ్యమైన బోధన ఉచిత పాఠ్యపుస్తకాలు యూనిఫాంలో మధ్యాహ్న భోజనం వంటి అంశాలపై ప్రజలకు వివరించారు. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి వారి భవిష్యత్తుకు బాటలు వెయ్యాలని కోరారు. అదేవిధంగా విద్యాధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందని తెలిపారు. విద్యార్థుల కోసం డిజిటల్ తరగతులు, మరుగుదొడ్లు తాగునీటి సౌకర్యం ఫర్నిచర్ తదితర మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు విద్యార్థులు క్రమశిక్ష ణతో చదువుకునేది ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పల్లె మల్లారెడ్డి, జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు, విద్యార్థులు ప్రజలు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేకు 12 ఏళ్ల తర్వాత రైతు సమస్యలు తెలిసి వచ్చాయా?

### జూలూరు పిఎసిఎస్ చైర్మన్ అందెల లింగం యాదవ్

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :**బిఆర్ఎస్ పార్టీ భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డికి 12 ఏళ్ల తర్వాత రైతు సమస్యలు తెలిసి వచ్చాయా? రైతు వరి ధాన్యం అమ్మకాల కష్టాల పట్ల ఇప్పుడు జ్ఞానోదయం అయ్యిందా ? ఎంత హాస్య స్పందమంటూ జూలూరు పిఎసిఎస్ చైర్మన్ అందెల లింగం యాదవ్ ఘాటుగా ప్రశ్నించారు. నాలుగు రోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే పోచంపల్లి మండలంలోని గౌస్ కొండ రేవనపల్లి భీమనపల్లి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి తరుగు పేరుతో రైతులను నిలువెల్లా దోపిడీ చేస్తున్నారంటూ విమర్శించిన నేపథ్యంలో ఆయన గురువారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి పైళ్ళ శేఖర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. వరి ధాన్యం కొనుగోళ్లు, రైతు సమస్యల పట్ల రాజకీయాలు చేయడం సరి అయినది కాదని అంత చిత్తశుద్ధి ఉంటే సూచనలు చేసి రైతులకు మేలు జరిగేలా చేస్తే బాగుంటుందని హితవు పలికారు. గత 10 ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో ప్రజా ప్రతినిధులే రైస్ మిల్లు యజమానులు కావటం, లారీ యజమానులు,కొనుగోలు కేంద్రాల వద్ద ఇన్చార్జీలు కుమ్మక్కయి రైతు ధాన్యాన్ని గ్రేడులు, తాలు,తరుగు పేరిట 40 కి 600 గ్రా బదులుగా 42 కి గ్రా తూకం వేసి పూర్తిగా దోచుకుని ఇష్టా రాజ్యాంగా కోట్లకు కోట్ల రూపాయలను పోగేసుకున్నారని ధ్వజమెత్తారు. గతంలో ఎప్పుడైనా ఏ గ్రేడ్ ధాన్యంగానే ప్రభుత్వం కొనుగోలు చేసిందని బిఆర్ఎస్ నాయకులే దాన్ని బ్రీడ్ గా మార్చి రైతుల కష్టాన్ని మింగారని ఆరోపించారు. ప్రతి పంటకు కొనుగోళ్లలో అవకతవకలు జరిగిన విషయాన్ని మాజీ ఎమ్మెల్యే దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లిన నిమ్మకునీరెత్తనట్లుగా వ్యవహరించారని చర్యలు ఎందుకు తీసుకోలేదని సూటిగా ప్రశ్నించారు. ధాన్యపు సేకరణ సెంటర్ల వద్ద ప్రారంభించిన తర్వాత ఒక్కసారి కూడా రివ్యూ చేసిన దాఖలాలు లేవనీ అప్పుడు కనపడని కొనుగోలు సెంటర్లో వద్ద ఎదుర్కొనే సమస్యలు ఇప్పుడెలా గుర్తుకొస్తున్నాయని ఎద్దేవ చేశారు. అధికారంలో ఉన్నప్పుడు అందరికీ దోచి పెట్టావు.ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండి నీతులు చెప్పడం ఎంతవరకు సమంజసం విచక్షణ నీకే వదిలేస్తున్నాను అని అన్నారూ..

ఎప్పుడూ ప్రజల పక్షాన నిలవాలి నిజమైన నాయకుడు అన్నప్పుడు అని ఘంటా పదంగా చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటుంది.చరిత్రకు సాక్ష్యం నిలుస్తుందనీ అన్నారు.

## యధేచ్ఛగా మట్టి రవాణా



**ప్రజాపక్షం/వేములపల్లి :** మండలంలో అక్రమ మట్టి రవాణ యదేచ్ఛగా కొనసాగుతుంది, ఇందిరమ్మ ఇల్లులు రైస్ మిల్లుల నిర్మాణం ఎక్కువగా ఉండడంతో మట్టి విక్రయ దారుల దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది,దానికి ప్రభుత్వ అధికారుల అండదండలు మెండుగానే ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి మొల్కపట్నం పచ్చరుగడ్డ ప్రాంతాల నుండి అక్రమంగా మట్టి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న విషయం అధికారులకు తెలిసిన తెలియనట్లు వ్యవహరిస్తున్న తీరు పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తునా్నరు,రాత్రి పగలు తేడా లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న దళారులకు అడ్డు తిరిగిన వారిని అవమానిస్తూ ఏం చేస్తారో చేసుకోండి అని బెదిరింపులకు గురించేస్తున్నట్లు వారు వాపోతున్నారు ఏదేమైనా ఈ ఏడు మట్టి విక్రయదారుల దందాలకు అధికారుల అండదండలు ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు,ఇప్పటికైనా అధికారులు అక్రమ మట్టి రవాణా కి చెక్ పెట్టకపోతే వచ్చే ప్రకృతి బీభత్సాలకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## క్రైస్తవులకు ఎస్‌సి హోదా రాజ్యాంగ హక్కు




**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్:** క్రైస్తవులకు ఎస్‌సి హోదా రాజ్యాంగం కల్పించిన హక్కు అని తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిషప్ దుర్గం ప్రభాకర్ అన్నారు. గురువారం మండలంలోని కేసారం బేతెస్థ ప్రార్థన మందిరంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రెవ. ఏర్పుల క్రిస్టోఫర్ ఆధ్వర్యంలో జరిగిన దళిత క్రైస్తవ సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా మాట్లాడారు. గతంలో భారత ప్రభుత్వం రంగనాథ్ మిశ్రా జాతీయ కమీషన్ ను ఏర్పాటు చేసిందని మాజీ సిజెఐ రంగనాథ్ మిశ్రా అధ్యక్షతన దళిత క్రైస్తవులు వివక్షను ఎదుర్కొంటున్నారని నివేదికను ప్రభుత్వంకు సమర్పించారని దానిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బొక్క ఏలీయా రాజు, రెవ. డాక్టర్ డి. జాన్‌ప్రకాష్, రెవ. పంది మార్క్, పాస్టర్ కొండేటి లాజర్, పాస్టర్ ప్రేమ్‌సాగర్, పిట్టల సామేల్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మార్గదర్శి కెఎన్‌ఎం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని ఈదులగూడలోని కేఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎంతో మంది మేధావులను తయారు చేసి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మార్గదర్శిగా నిలిచిందని కళాశాల ప్రిన్సిపాల్ మలిగిరెడ్డి భీమార్జున్‌రెడ్డి అన్నారు. విద్యా వారోత్సవాల్లో భాగంగా గురువారం పేద విద్యార్థులను జ్ఞాన సంపన్నులుగా చేసేవి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలేనని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ప్రతి పూర్వ విద్యార్థి కళాశాల అభివృద్ధికి తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. అదేవిధంగా లయన్స్ క్లబ్, వర్షిత ఆసుపత్రి డాక్టర్ రాంబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గోళ్ల సుధాకర్, నర్సిరెడ్డి, లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ బిఎం.నాయుడు, లింగయ్య, సత్యనారాయణరెడ్డి, కావ్య, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## హక్కుల నేతకు ఘన నివాళి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మానవ హక్కుల వేదిక ఉమ్మడి నల్గొండ జిల్లా ఆధ్వర్యంలో హక్కుల నే త ఆచార్య బుర్ర రాములు 15వ వర్ధంతి సందర్భ ంగా ఘనంగా గురువారం నల్లగొండ పట్టణంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అ ర్పించారు.ఈసందర్భంగా మానవ హక్కుల వేదిక ప్రతినిధి చింత మల్ల గురువయ్య మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ఆచార్యునిగా బుర్ర రాములు మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగిన ప్రతిసారి ప్రజల తరపున ముందుండి పోరాడి మార్గదర్శిగా నిలిచారని వారి స్ఫూర్తిని కొనసాగించాలని ఈ సందర్భంగా పి లు పునిచ్చారు.నేడు సామాజిక,రాజకీయ ఆర్థిక పరిస్థితులలో మానవ హక్కులు నానాటికి అననం కాపాడుతున్న దృష్ట్యా ప్రతి పౌరుడు చైతన్యవంతమై ప్రశ్నలాగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వేదిక రాష్ట్ర నాయకులు జీ మోహన్ మాట్లాడుతూ ఆచార్య బుర్ర రాములు ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు జీవితాంతం కట్టుబడి పనిచేసిన మానవ హక్కుల ఉద్యమకారుడని కొనియాడారు.విద్యార్థులు, రైతులు, కార్మికులు, దళితులు, గిరిజనులు వంటి అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన నిరంతరం పోరాడారని తెలిపారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు అక్కినపల్లి వీరస్వామి,కే. పర్వతాలు, పందుల సైదులు ,ఇందూరి సాగర్, వెంకటరమణ , లక్ష్మల్ల మధు, జానకిరామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అదనపు పని భారంతో గ్రామ పంచాయితీ సిబ్బంది



**ప్రజాపక్షం/మోతె :** అదనపు పని భారంతో గ్రామ పంచాయితీ సిబ్బంది సతమతమవుతున్నారు. మండల కేంద్రం కావడంతో ఏ అధికారి ఎప్పుడు ఏ పని చెపుతారో అర్థం కాక తలలు పట్టుకుంటునా్నరు. ప్రతిరోజు గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్ళి చెత్త సేకరించడంతోపాటు, వీధుల్లో పేరుకపోయిన చెత్తను, పిచ్చిమొక్కలను తొలగించి, మురుగు కాల్వలు శుభ్రం చేసి, లీకేజి అయిన పైపులను బాగు చేస్తూ ప్రతినిత్యం తమ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది మాపై పని భారం పడుతుందని లబోదిబోమంటున్నారు. గ్రామంలో చేసే పనులతోపాటు మండల కేంద్రంలో ఉన్న పోలీసు స్టేషన్‌తోపాటు తహశీల్దార్ కార్యాలయం, మండల అభివృద్ధి కార్యాలయం, రైతు వేదికలలో కార్యక్రమం ఏదైనా వారి వారి కార్యాలయంలో ప్రతి పనికి పంచాయితి సిబ్బందిని ఉపయోగిస్తుండడంతో పని ఒత్తిడి ఎక్కువ అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఆయా కార్యాలయాల అధికారులు గ్రామ పంచాయితీ సిబ్బందితో పనులు చేయించుకుంటూ, ప్రైవేటు వ్యక్తులతో పనులు చేయించుకున్నట్లు వాటికి బిల్లు పెట్టుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. గత మూడు నెలల నుండి వేతనాలు కూడా రావడంలేదని తమ గోడు ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా తమపై పనిభారం తగ్గించి గ్రామ పంచాయితీకి సంబంధించిన రోజువారి పనులను మాత్రమే చేయించాలని అధికారులను వేడుకుంటున్నారు.

## విద్యార్థులు వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/హాలియా:** విద్యార్థులు వివిధ సంస్థలు అందిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతికి ఉపయోగించుకోవాలని హాలియా మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి అన్నారు.గురువారం హాలియాలోని ఆరవ వార్డు విద్యాధర ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బద్దపాక ప్రసాద్ నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వేసవిలో నిర్వహిస్తున్న ఈ సమ్మర్ క్యాంపులలో గురువులు అందిస్తున్న విలువైన సమాచారాన్ని ఆసక్తిగా ఆలకించి వాటిని జీవితంలో ఉపయోగపడేలా చూసుకోవాలన్నారు. విద్యార్థులు టీవీలు, ఫోన్లకు దూరంగా ఉంటూ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానికి అనుగుణంగా ఇస్తున్న శిక్షణా శిబిరాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపకులు డాక్టర్ బద్దె పాక ప్రసాద్, ఆరో వార్డు కౌన్సిలర్ బొంగరాలు ఏసు రాజు, కటికల నగేష్, నాగరాజు, రవిశంకర్, అజయ్, అనిల్, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

## తౌసిఫ్ అహ్మద్‌కు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ;పిహెచ్.డి పట్టా



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** కోవిడ్19 గుర్తింపుపై అధునాతన పరిశోధన చేసిన నల్లగొండ జిల్లా విద్యార్థి ముహమ్మద్ తౌసిఫ్ అహ్మద్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం పీహెచ్.డి పట్టా ప్రదానం చేసింది.ఆక్యురేట్ కోవిడ్19 డిటెక్షన్ యూజింగ్ ఛస్ట్ ఎక్స్‌రే వర్సెస్ జీనోమ్ డేటా విత్ ట్యూన్డ్ కన్వల్యూషనల్ న్యూరల్ నెట్‌వర్క్ అనే అంశంపై తౌసిఫ్ అహ్మద్ విస్తృత పరిశోధన చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్,కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన డాక్టర్ ముహమ్మద్ అబ్దుల్ హమీద్ మార్గదర్శకత్వంలో ఈ పరిశోధన పూర్తయింది.పరిశోధనలో ఛస్ట్ ఎక్స్‌రే ఆధారిత విశ్లేషణతో పోలిస్తే జీనోమ్ డేటా ఆధారిత డీప్ లెర్నింగ్ విధానం ఎక్కువ ఖచ్చితత్వంతో ఫలితాలను ఇచ్చిందని తేలింది. వైరస్‌లలో సంభవించే జన్యు మార్పుల నమూనాలను గుర్తించడం,ముఖ్యమైన జన్యు మోటిఫ్‌లను వెలికితీయడం ఈ అధ్యయనం ప్రధాన ప్రత్యేకతగా నిలిచింది.కొత్త వైరస్ వేరియంట్ల గుర్తింపు, మ్యూటేషన్ విశ్లేషణ,బయోఇన్ఫర్మాటిక్స్ ఆధారిత వైద్య పరిశోధనలకు ఈ అధ్యయనం ఉపయోగపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.ముహమ్మద్ తౌసిఫ్ అహ్మద్ సాధించిన ఈ ఘనతపై కుటుంబ సభ్యులు, అధ్యాపకులు,స్నేహితులు మరియు శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## సర్కార్ బడుల్లోనే నాణ్యమైన విద్య



**ప్రజాపక్షం/అర్వపల్లి :** సర్కార్ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని సూర్యాపేట జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటుకు వెళ్తున్న ప్రతి పిల్లవాడిని మన ప్రభుత్వ బడికి వచ్చేవిధంగా ప్రతి ఒక్క ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం 10 శాతం విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు. అనంతరం బడిబాట ఆడియోను విడుదల చేశారు. 6వ తరగతి ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న కుమారి సాత్వికను నూతన అడ్మిషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి బాలు నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏఏపిసి చైర్మన్ సునీతా రాంబాబు, ఉపాధ్యాయులు మధుకర్, మిమల, శ్రీరాములు, రమేష్ కుమార్, స్వర్ణలత, పుష్పావతి, వీరన్న, అంజి, నాగమణి, పి. మల్లేశ్ పాల్గొన్నారు.

## పరపతి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** తెలంగాన రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ హుజూర్‌నగర్ ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, కంబాల శ్రీనివాస్ లు మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని, నామినేటెడ్ పద్ధతి సరైంది కాదని, ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు. వ్యవసాయం మీద ఆధారపడి రైతులు నూటికి నూరుశాతం మంది ఉన్నారని వారికి అందుబాటులో ఉండేలా గ్రామీణ బ్యాంకు కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యల్లావుల రాములు, రైతు సంఘం పట్టణ కార్యదర్శి మామిడి వెంకయ్య, కౌన్సిలర్ చెనగానిసైదులు, ఇందిరాల వెంకటేశ్వర్లు, కుడితోట్టి స్వామి, బంటు శ్రీనివాస్, బత్తిని మల్లయ్య పాల్గొన్నారు.

## ఘనంగా పిడమర్తి రవి జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** తెలంగాణ రాష్ట్ర ఎస్‌సి కార్పోరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి జన్మదిన వేడుకలు గురువారం సూర్యాపేట పట్టణంలో తెలంగాణ మాజీ మాదిగ జెఏసి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొండకింది గోవిందరావు మాట్లాడుతూ మాదిగ హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతున్న తెలంగాణ రాష్ట్ర ఎస్‌సి కార్పోరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి సేవలను ఆయన కొనియాడారు. ఆయన ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని నిండునూరేళ్ళు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాదిగ సంఘం జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షులు బొజ్జ ఎడ్వర్డ్, నియోజక వర్గ అధ్యక్షులు జఫానీయా, నాయకులు బొజ్జ సంజయ్, పడిదల జానకిరాములు పాల్గొన్నారు.

## మితిమీరిన రసాయనాలు హానికరం

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్:** మితిమీరిన రసాయనాల వాడకం ద్వారా నేలసారం తగ్గడమే కాకుండా, పర్యావరణానికి హానికరమని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు అరుణకుమారి, సునిత హెచ్చరించారు. గురువారం మండలంలోని అనాజీపురం గ్రామంలో రైతు ముగింట్లో శాస్త్రవేత్తల కార్యక్రమంలో భాగంగా వానాకాలం సీజన్ విత్తనాల ఎంపిక, నూతన వరి వంగడాలు, సేంద్రియ వ్యవసాయం, పంట మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు నీటిని పొదుపుగా వాడుకుంటూ పంట సాగు ప్లాన్ చేసుకోవాలన్నారు. ఆయిల్ ఫామ్ సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి. అనిల్ కుమార్, ఏఈఓ కె. మురళీ, సర్పంచ్ అనుములపురి నాగయ్య, మార్కెట్ కమిటి డైరెక్టర్ మేడిమేలపు దామోదర్ రెడ్డి, ఉపసర్పంచ్ చెన్ను స్వప్న భారత్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# సమాజ హితులు ఆర్యవైశ్యులు




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సమాజం మేలు కోరుకునే హితులు ఆర్యవైశ్యులని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, సుప్రీంకోర్టు అడ్వకేట్, రిటైర్డ్ జడ్జి, శ్రీవాసవి సేవా సమితి జాతీయ లీగల్ అడ్వైజర్ నేరెళ్ల మాలియాద్రి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని 36వ వార్డులో శ్రీవాసవి సేవా సమితి నూతన జిల్లా కార్యాలయాన్ని శ్రీవాసవి సేవా సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పూరి సురేష్ శెట్టితో కలిసి ప్రారంభించి వారు మాట్లాడారు. మానవ సేవే మాధవసేవ అనే సిద్ధాంతాన్ని నమ్మి ఆచరణలో చూపిస్తున్న కులస్తులు ఆర్యవైశ్యులన్నారు. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవడంలో ఆర్యవైశ్యుల పాత్ర వెలకట్టలేనిదన్నారు. నిరుపేదల కష్టాలు, బాధలు చూసి చదివించే మనసు ఉన్న ఆర్యవైశ్యులు సమాజ సేవలో ముందు వరుసలో ఉన్నారన్నారు. శత్రువులంటూ లేకుండా జీవనం సాగించే ఆర్యవైశ్యులు ఎందరికో ఆదర్శం అన్నారు. అన్ని మతాలను గౌరవిస్తూ తమ మతం కోసం ప్రాణాలు సైతం ఇవ్వడానికి వెనకాడబోరని స్పష్టం చేశారు. తల్లి దండ్రులు తమ పిల్లలను ప్రతిరోజు దేవాలయాలకు తీసుకువెళ్లాలని దీని ద్వారా భారతీయ సంస్కృతి సాంప్రదాయం భవిష్యత్ తరాలకు అందించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు చెట్లను నాటుతూ వాటిని సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. కరోనా సమయంలో శ్రీవాసవి సేవా సమితి ఆధ్వర్యంలో కృష్ణపట్నం సంబంధించిన మందును 30వేలకు పైగా కుటుంబాలకు అందించామని గుర్తు చేశారు. ఆర్యవైశ్యులు ఐక్యంగా ఉంటూ ఏ చిన్న సమస్య ఉన్నా పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ పివిసి మేనేజింగ్ డైరెక్టర్ మీలా మహదేవ్, కె. శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు ఫరూక్, గౌరవ చైర్మన్ ఈగ దయాకర్ గుప్తా, జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం గోపారపు రాజు, దేవరశెట్టి నాగరాజు, సోమ ప్రవీణ్ కుమార్, మిర్యాల సుధాకర్, రాచకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నీటి ట్యాంకులను త్వరితగతిన పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/హాలియా:** అమృత స్కీం కింద నిర్మాణంలో ఉన్న తాగునీటి ట్యాంకులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ చింతల చంద్ర రెడ్డి సూచించారు. గురువారం హాలియాలోని సాగర్ రోడ్డులో గల ఎంఎల్‌ఆర్ కాలనీలో అమృత స్కీం కింద నిర్వహిస్తున్న నీటి ట్యాంకుల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పబ్లిక్ హెల్త్ ఎస్ఈ వెంకటేశ్వర్లు తో కలిసి ఆయన మాట్లాడారు. అమృత్ స్కీం కింద నిర్మిస్తున్న నాలుగు నీటి ట్యాంకులను సాధ్యమైనంత తొందరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. వేసవిలో కార్మికులు అందుబాటులో లేకపోవడం వలన పనుల్లో జాప్యం జరుగుతుందని సంబంధిత అధికారులు తెలిపారు. అయితే నిర్మాణంలో జరుగుతున్న తీవ్ర జాప్యం మూలంగా అనుకున్న లక్ష్యాన్ని త్వరితగతిన చేరుకోలేకపోతున్నామని మున్సిపల్ చైర్మన్ చెప్పారు. దీనికి స్పందించిన అధికారులు నిర్మాణ కార్మికుల్ని ఇతర ప్రాంతాల నుంచి రప్పించైన పనులు వెంటనే పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ఈ పర్యవేక్షణలో మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి పబ్లిక్ హెల్త్ డీఈ, ఏఈలు ఉన్నారు.

## ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య చిత్ర పటానికి పాలాభిషేకం

**ప్రజాపక్షం/ఆలేరు :** ప్రభుత్వం పాడి రైతుల పెండింగ్ బిల్లులను చెల్లించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆలేరు మండలం మంతపురి గ్రామంలో గురువారం ప్రభుత్వ విప్, బీర్ల ఐలయ్య చిత్రపటానికి గ్రామ సర్పంచ్ సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, పాడి రైతులు ప్రభుత్వానికి మరియు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కర్రె ఎల్లయ్య, కొరటూరి బిక్షపతి, పేరపు స్వామి, రవి, వీరాచారి, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కేంద్రాల వద్ద రైతు సమస్యలు పరిష్కారించాలి

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో చిన్న లక్ష్మ పురంగ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు పక్కిర్ రాజేందర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు వెలుగులోకి వచ్చాయని మంచి నాణ్యత (మ్యాచర్ ఉన్న) వడ్లను కూడా బి గ్రేడ్గా కొనుగోలు చేస్తున్నారని, దీంతో రైతులకు రావాల్సిన సరైన ధర దక్కడం లేదని ఇది రైతులను మోసం చేసే చర్య అని వారు పేర్కొన్నారు. ఒక వైపు నెలల తరబడి కొనుగోలు కోసం ఎదురు చూడాల్సి రావడం, మరోవైపు నాణ్యమైన ధాన్యానికి సరైన గ్రేడ్ ఇవ్వకపోవడం రైతులకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు కలిగిస్తున్నాయని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకత ఉండాలని, మంచి నాణ్యత ఉన్న వడ్లను సరైన గ్రేడ్లో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ రైతుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని విమర్శిస్తూ, నరేంద్ర మోదీ నాయకత్వంలో



రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు.ఈ క్రమంలో జిల్లా కార్యదర్శి కొక్కొండ లక్ష్మి నారాయణ గౌడ్, రాష్ట్ర మైనార్టీ మోర్చా కార్యవర్గ సభ్యులు చాంద్ పాషా, జిల్లా మీడియా కో కన్వీనర్ భానోత్ శంకర్ నాయక్, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి బొల్లా నర్సింహయాదవ్, జిల్లా యువమోర్చా కార్యదర్శి మేకల పాండు యాదవ్, సీనియర్ నాయకులు పాముల రామచంద్రం, పాల్గొన్నారు.

## పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాల ఆదాయం రూ.కోటి 74 లక్షలు

**ప్రజాపక్షం/మల్యాల:** జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టులో మూడు రోజుల పాటు నిర్వహించిన హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవముల సందర్భరంగా వివిధ టిక్కెట్ల ద్వారా 1కోటి 74 లక్షల 18 వేల 905 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇఒ అంజనా రెడ్డి పత్రిక ప్ర కటనలో తె లిపారు.శీఘ్ర దర్శనము 17,94,200 విక్రయాల ద్వారా ఈ ఆదాయం వ చ్చి ందన్నారు.గత సంవత్సరము ఆదాయ ము కంటే ఈ సంవత్సరము సుమారు 24 ల క్షల ఆదాయము అధికంగా వచ్చినట్లు ఆ యన తెలిపారు .

## ప్రభుత్వ పాఠశాలల గొప్పతనం చాటుతున్న 'బడిబాట'

**ప్రజాపక్షం /పెగడపల్లి :** మండల పరిధిలోని ఐతుపల్లి గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ బడిబాట కార్యక్రమాన్ని గురువారం గ్రామ కేంద్రంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. బడిబాట మన అందరి బాధ్యత అనే నినాదంతో పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు కలిసి ఉమ్మడిగా అవగాహన ర్యాలీ చేపట్టారు.గ్రామ చౌరస్తాలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేకల అంజమ్మ మల్లయ్య, ఉప సర్పంచ్ గోలి సంజీవరెడ్డి, జెడ్పీ హెచ్ ఎస్ హెచ్‌ఎం చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ ఎస్ హెచ్ ఎం సురేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని బడిబాట ఫ్లెక్సీని, కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్లు నిండిన ప్రతి బిడ్డను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించి, ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత నాణ్యమైన విద్యను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులను కోరారు. సర్కారు బడుల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, డిజిటల్ తరగతులు పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు వివరించారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.అనంతరం గ్రామంలోని వీధుల గుండా ప్రదర్శన నిర్వహిస్తూ, ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులకు విద్యా పథకాలపై అవగాహన కల్పించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు: డాక్టర్ కిరణ్ కుమార్



**ప్రజాపక్షం/నకిరేకల్ :** అంకితభావంతో విధులు నిర్వర్తిస్తేనే తగిన గుర్తింపు లభిస్తుందని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ ఎస్. కిరణ్ కుమార్ అన్నారు.గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నకిరేకల్ ఎంపీడీవోగా పనిచేసి డిప్యూటీ సీఈఓగా పదోన్నతి పొందిన జై వెంకటేశ్వరావును అధికారులు, సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ జై వెంకటేశ్వరావు మండల అభివృద్ధికి అంకితభావంతో పనిచేశారని కొనియాడారు.జై వెంకటేశ్వరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో సహచర ఉద్యోగుల సహకారం మరువలేనిదని, నకిరేకల్ మండలాన్ని జిల్లాలో ఉన్నత స్థాయిలో నిలిపేందుకు అందరూ కలిసి పనిచేశారని తెలిపారు.కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎండీఓ సుధాకర్,ఎంఈఓ మేక నాగయ్య,ఏపీవో రమణయ్య,పంచాయతీరాజ్ ఏఈ సంపత్ కుమార్, ఇన్‌చార్జి ఎంపీఓ మధు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## హమాలీ కార్మికులకు ఒఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

**ప్రజాపక్షం/ముత్తారం :** ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ముత్తారం మండలం లో ని హరిపురం గ్రామంలో హమాలీ కార్మికుల కు గురువారం ఒఆర్ఎస్ ప్యాకెట్లను గ్రామ సర్పంచ్ మెంగాని సమత తిరుపతి ఆస్పత్రి సిబ్బందితో కలిసి పంపిణీ చేశారు.సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎండల్లో పనిచేసేటప్పుడు కార్మికులు తగిన జాగ్రత్తలు తీ సుకోవాలని, డిహైడ్రేషన్‌కు గురికాకుండా ఒఆర్ఎస్ ద్రావణం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గ్రామ సర్పంచ్ మెంగని , వార్డు మెంబర్, ఏఎన్ఎం ,ఆశా కార్య కర్తల తో పాటు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం...కటింగ్‌లు ఆపాలి

### మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

**ప్రజాపక్షం /పెగడపల్లి :** గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేవని, కానీ ప్రస్తుత రేవంత్ రెడ్డి పాలనలో రైతాంగం తీవ్ర అవస్థలు పడుతోందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. పెగడపల్లి మండలం కీచులాటపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం పరిశీలించారు. కల్లాల్లో ఉన్న ధాన్యం కుప్పలను చూసి, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ పొలాల్లో ధాన్యం కుప్పలు తెప్పలుగా పోసి ఉందని,అకాల వర్షాల భయంతో రైతులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని వేచి చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలకు లారీలు సకాలంలో రాకపోవడం వల్లనే ఈ జాప్యం జరుగుతోందని మండిపడ్డారు. దీనికి తోడు మిల్లుల దగ్గర ఒక బస్తాకు సగటున 3.2 కేజీల చొప్పున (క్వింటాల్‌కు 7.5 కేజీలు) తరుగు పేరిట కటింగ్ చేస్తున్నారని, ఇది రైతులను నట్టేట ముంచడమేనని విమర్శించారు.ధాన్యం కల్లాల్లో పోసి నెల రోజులు గడుస్తున్నా ప్రభుత్వానికి పట్టింపు లేదని ఆయన దుయ్యబట్టారు. ధర్మపురి నియోజకవర్గ మంత్రి, జిల్లా కలెక్టర్, కాంగ్రెస్ నాయకులు రైతుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదని ఆరోపించారుగత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ నాయకత్వంలో రైతులకు సాగునీరు, 24 గంటల ఉచిత విద్యుత్, సకాలంలో పెట్టుబడి సాయం, ఎరువులు అందాయని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆ వ్యవస్థలన్నీ అస్తవ్యస్తమయ్యాయని ఆరోపించారు.రైతులను ఆదుకోవాల్సిన కనీస బాధ్యత స్థానిక మంత్రి, కలెక్టర్‌పై ఉందని బిఆర్ఎస్ పక్షాన ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు,రైతులు పాల్గొన్నారు.

## నిరుపేద ముస్లిం కుటుంబానికి రాజగోపాల్ రెడ్డి రూ.లక్ష సాయం

**ప్రజాపక్షం/మునుగోడు:** మండల కేంద్రానికి చెందిన నిరుపేద ముస్లిం కుటుంబానికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆర్థిక సాయం అందించారు.మండల కేంద్రానికి చెందిన షాహిదా భర్తను కోల్పోయి అనారోగ్యంతో బాధపడుతూ కుటుంబ పోషణలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.తన కుమార్తె వివాహం కోసం ఎమ్మెల్యేను ఆశ్రయించగా ఆయన రూ.1 లక్ష ఆర్థిక సహాయం ప్రకటించారు.గురువారం వివాహం సందర్భంగా కాంగ్రెస్ నాయకులు లక్ష రూపాయల చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కర్నాటి స్వామి యాదవ్, మాజీ సర్పంచ్ మిర్యాల వెంకటేశ్వర్లు, యువజన కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు పాల్వాయి జితేందర్ రెడ్డి, సాగర్ల లింగస్వామి, ఎండి అన్వర్, వల్లంచెట్ల రవి, దుబ్బ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.